రామయ్యకు స్వర్ణ పుష్పాలతో పూజలు

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 16: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఆదివారం ఉదయం అర్చకులు అంతరాలయంలోని మూలవరులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి 108 బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కల్యాణం నిర్వహించి, కల్యాణంలో పాల్గొన్న వారికి స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ఐటీడీఏ పీవో బదిలీని నిలిపివేయాలి

వినతిపత్రం అందిస్తున్న నాయకుడు మల్లుదొర

భద్రాచలం, జూన్ 16: భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ బదిలీని నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు సొంది మల్లు దొర అన్నారు. ఆదివారం ఈ మేరకు ఐటీడీఏ మాజీ పీవో ప్రతీక్ జైన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రేసు ఆదినారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, కార్యదర్శి శ్యామల, గోవింద్, మురళి, పెనుబల్లి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్

భద్రాచలం, జూన్ 16: భద్రాచలం పట్టణంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ (ఉదయాస్తమాన సేవలు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో శ్రీరామ కోటి లేఖన వేదికను వోలేటి శ్రీనివాస గుప్తా ప్రారంభించారు. అనంతరం స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్ అందజేశారు. కార్యక్రమంలో బండారు నరసింహారావు, విశ్వనాథ్ గుప్తా, రేపాక శ్రీనివాస్, చారుగుళ్ల శ్రీనివాస్, తోకల నాగేశ్వరరావు, అద్దంకి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

మొక్కలు నాటుతున్న చిన్నారులు

చుంచుపల్లి, జూన్ 16: ఫాదర్స్‌డే సందర్భంగా పర్యావరణ అవార్డు గ్రహీత చిన్నారి మూడ్ విశ్వామిత్ర చౌహాన్ ఆధ్వర్యంలో చిన్నారులు మొక్కలు నాటారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మూడ్ జయరాం నాయక్ తనయుడు, ప్రకృతి హరితదీక్ష తీసుకొని ప్రతి రోజూ మొక్కలు నాటుతున్నాడు. ఈ నేపథ్యంలో ఫాదర్స్ డేను పురస్కరించుకొని తన స్నేహితులతో కలిసి మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు.

చెట్ల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యం

చెట్ల పెంపకం ఆవశ్యకతను వివరిస్తూ ప్రచారం చేస్తున్న సాంబయ్య

జూలూరుపాడు, జూన్ 16: భవిష్యత్‌లో చెట్ల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యం అవుతుందని కొంటు సాంబయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మండల కేంద్రంలో ప్రకృతి ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. రాబోయో కాలంలో ఆక్సీజన్ కోసం ప్రతిఒక్కరూ వేలు ఖర్చు పెట్టి సిలిండర్లు వెంట పెట్టుకొని తిరగాల్సిన రోజులు వస్తాయంటూ చెట్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో దోమల మందు పిచికారీ

ప్రభుత్వ కార్యాలయాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్న పంచాయితీ సిబ్బంది

చంద్రుగొండ, జూన్ 16 : దోమల మందు పిచికారీతో అంటువ్యాధులు ప్రభలకుండా ఉంటాయని మెడికల్ అధికారి కనకం తనూజ అన్నారు. ఆదివారం మండలలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు కేజీబీవీ వసతిగృహం, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సైతం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా తనూజ మాట్లాడుతూ.. ప్రస్తుత వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఉండాలంటే దోమలు వ్యాప్తిచెందకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ మెడికల్ అధికారి కుమారస్వామి, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

'బీజేపీ చర్యలు అమానుషం'

టేకులపల్లి, జూన్ 16 : ప్రముఖ రచయిత అరుంధతిరాయ్‌ని ఉపా కింద ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని బీజేపీకి అణిచివేస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీ చర్యలు అమానుషమని అన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జూన్ 16: ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మసీదులు, దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 రోజులుగా 7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది బక్రీద్ బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో హెచ్చరించారు.

రామయ్య సేవలో కలెక్టర్ జీతేశ్ వీ పాటిల్

స్వామివారిని దర్శించుకున్న కలెక్టర్

భద్రాచలం, జూన్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని ఆదివారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జీతేష్ వి పాటిల్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు లక్ష్మి తాయారమ్మ వారి సన్నిధిలో వేదాశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు, అందజేయగా దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి స్వామివారి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. దేవస్థానం ఈఈ రవీందర్ రాజు, వేద పండితులు హనుమత్ శాస్త్రి, ఎల్ ఆర్ కే ప్రసాద్, ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేశా..

ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ప్రతీక్ జైన్‌ను సత్కరిస్తున్న ఐటీడీఏ యూనిట్ అధికారులు

భద్రాచలం, జూన్ 16: యూనిట్ అధికారులు, సిబ్బంది, ఆదివాసీ యూనియన్ నాయకుల సహకారంతో గిరిజనుల అభివృద్ధి కృషి చేశానని వికారాబాద్ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం రాత్రి ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీ ఉత్తర్వులు రాగానే యూనిట్ అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, నా శక్తి మేర గిరిజన సంక్షేమం కోసం పనిచేశానన్నారు. తనకు సహకరించిన యూనిట్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనిట్ అధికారులు ప్రతీక్ జైన్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌లో మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి ఎంపీపీకి తినిపిస్తున్న మహిళ

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

అశ్వారావుపేట, జూన్ 16 : తెలంగాణ స్వరాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో బంగారు తెలంగాణ నిర్మాణానికి పునాదులు పడ్డాయని, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించిందని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సి ఉందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరాఖండ్‌లోని శ్రీనగర్‌లో 'మెచ్చా' జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన యాత్రికులకు పంపిణీ చేశారు. 'మెచ్చా'కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక అనాథలకు అన్నదానం చేశారు. ఆయనతో పాటు అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు చెందిన భోగవల్లి రాంబాబు, రాళ్ళబండి జగదీశ్వర్‌రాజు, గోపాలకృష్ణ, శీమకుర్తి శివ ప్రసాద్, పసుమర్తి విజయకృష్ణ, మురళీకృష్ణ ఉన్నారు.

దమ్మపేటలో...

దమ్మపేట, జూన్ 16 : మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక మసీద్ కాంప్లెక్స్‌లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి మెచ్చాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొడ్డా రమేశ్, గాజుబోయిన ఏసు, పాకనాటి శ్రీను, జిన్నా యార్లగడ్డ శ్రీను, బుడే పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేట టౌన్, జూన్ 16 : మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మండల నాయకులు తాడేపల్లి రవి, చిప్పనపల్లి బజారయ్య, వెంకటేశ్వరావు, సోమాని రమేష్, చరణ్, రాంబాబు, శ్రీను, సూరి పాల్గొన్నారు.

చండ్రుగొండలో...

చండ్రుగొండ, జూన్ 16 : మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజల మన్ననలు పొందిన నాయకులకు ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, సొసైటీ డైరెక్టర్ ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వరరావు, మద్దిరాల చిన్నపిచ్చయ్య, కేశోతు శ్రీను, రమేశ్, వెంకటేశ్వర్లు, ఇస్లావత్ వీరన్న, ఉగ్గం శ్రీను, జానకి రాములు, బాలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిలో ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాల్వంచ, జూన్ 16: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు పులిహోర ప్రసాదం అందజేశారు. ఈవో సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ అడ్‌హక్ కమిటీ ఎన్నిక

మణుగూరు టౌన్, జూన్ 16: మండలంలోని తోగ్గూడెం సమ్మక్క– సారలమ్మ గుడి ప్రాంగణంలో ఆదివాసీ సంఘాల జేఏసీ అడ్‌హక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోడె రవి కుమార్ దొర, ఉపాధ్యక్షులుగా ఇర్ప రవికుమార్, గనిబోయిన ముత్తయ్య, పూనెం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా వాగబోయిన శ్రీను, సహాయ కార్యదర్శిగా పాయం నాగరాజు, కారం నర్సింహారావు, కార్యదర్శిగా పూనెం నాగరాజు, కోశాధికారిగా జోగ సురేంద్ర ప్రసాద్‌తోపాటు పలువురు సభ్యులు, గౌరవ సలహాదారుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళా ఉద్యోగినుల కోసం కార్యాలయాల్లో మహిళ వేధింపుల రక్షణగా కమిటీలు ఏర్పాటు, ఆదివాసీ ఉప తెగల విద్యా అవకాశాల కల్పనకు ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు, ఇండస్ట్రియల్ యాక్ట్ ప్రకారం స్థానిక ఆదివాసులకు శిక్షణతో కూడిన 100శాతం ఉద్యోగ కల్పన, సమతా జడ్జి మెంట్ ప్రకారం 25శాతం లాభాలలో వాటా స్థానికంగా ఖర్చు చేయడం తదితర అంశాలపై చర్చించారు.

బస్సు సౌకర్యం లేక విద్యార్థుల ఇబ్బందులు

మణుగూరు టౌన్, జూన్ 16: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి పాఠశాలలో విద్యార్థులకు బస్సులు ఏర్పాటు చేయకపోవంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏరియా టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. గతేడాది ఫలితాలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో సింగరేణి పాఠశాలపై నమ్మకం ఏర్పడిందని ఈ విద్యా సంవత్సరం సింగరేణి పాఠశాలలో ఎక్కువగా విద్యార్థులు చేరే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు బస్ సౌకర్యం కల్పించకపోడంతో చేరడానికి వెనుకడుగు వేసున్నారన్నారు. పాఠశాలకు మండలంలోని పగిడేరు, చిక్కుడుగుంట, సాంబాయిగూడెం, రామానుజవరం, కొండాయిగూడెం, అన్నారం, జగ్గారం, కల్యాణపురం పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు బస్సుకు వచ్చేవారని పేర్కొన్నారు. బస్సు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. సంస్థ ఆర్థిక ప్రయోజనాలతో పాటు చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు పాఠశాలకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వెంకట్ డిమాండ్ చేశారు.

బూర్గంపహాడ్‌లో భారీ వర్షం... రోడ్లన్నీ జలమయం

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

బూర్గంపాడు, జూన్ 16: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం కలిగింది. పత్తి గింజలు వేసిన రైతులకు కొంత ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు, జూన్ 16: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లపై వరద ప్రవహించింది. పత్తి విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో కురిసిన భారీ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం సాగుకు అనుకూలంగా వర్షాలు పడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండల కాంగ్రెస్‌పై మహిళా నేత ఆగ్రహం

చండ్రుగొండ, జూన్ 16 : మండల కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చండ్రుగొండలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి జిల్లా సేవాదల్ విభాగం మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మిని ఆహ్వానించకపోవడంపై సోషల్ మీడియా వేదికగా నాయకులు, ఎమ్మెల్యేపై పరోక్షంగా విమర్శలు, ఆరోపణలు చేశారు. స్థానికంగా నేత అయిన తనను ప్రారంభోత్సవానికి పిలవకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి నాయకులు ఉండడం వల్లే రాష్ట్రంలో బీజేపీకి సగం ఎంపీ సీట్లు పెరిగాయని, ఇటువంటి పార్టీకి కార్యాలయం అవసరమా ? అంటూ వ్యంగస్త్రాలు చేశారు. దీంతో సోషల్ మీడియాలో కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మహిళా నేత ఆరోపణలపై జిల్లా నాయకత్వం సరైన వేదికపై నివృతి చేయాలని మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు కోరుచున్నారు.

ఆధునిక కవితకు ఆధ్యుడు శ్రీశ్రీ

భద్రాచలం, జూన్ 16: ఆధునిక కవితకు ఆధ్యుడు శ్రీశ్రీ అని, శ్రీశ్రీని స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది గొప్ప కవులుగా ఎదిగారని ప్రముఖ సంఘ సేవకుడు లయన్ గాదె మాధవరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోవు తరాలవారు కవి సమ్మేళనాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ అధ్యక్షుడు తాతోలు దుర్గాచారి, కార్యదర్శి నాగలక్ష్మి , సొంపాక సీత, గాయకులు, కవులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

అశ్వారావుపేట, జూన్ 16 : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం డిస్కం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ బి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని ఆదివారం ఒక ప్రకనటలో తెలిపారు. కార్యక్రమంలో అశ్వారావుపేట, వినాయకపురం, దమ్మపేట, గండుగులపల్లి సబ్ స్టేషన్ల అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన వివరించారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

భద్రాచలం, జూన్ 16: త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో జీతేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ఏజెన్సీలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో సేవలందిస్తున్న ముస్లిం ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

భద్రాచలం, జూన్ 16: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం భద్రాచలం డివిజన్‌లో, ప్రతి ఏఈ, ఈఆర్‌ఓ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 'విద్యుత్ ప్రజావాణి' నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ జీవన్‌కుమార్ ఆ దివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యు త్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల తెలపాలని ఆయన కోరారు.

తునికాకు బోనస్ చెల్లించాలి

భద్రాచలం, జూన్ 16: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెల్లించాలని, పోడు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబూరావు అన్నారు. పట్టణంలో జరిగిన జిల్లా కమిటీ సమావేవలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో విద్య, వైద్యం మెరుగైన సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం మహోత్సవాలు

చుంచుపల్లి, జూన్ 16: రుద్రంపూర్‌లోని సీతారామచంద్ర ఆలయంలోని సీతారామ, భక్తాంజనేయ, శ్రీ రుద్ర లింగేశ్వర, మృత్యుంజయ సహిత నవగ్రహ, సుబ్రహ్మణ్యేశ్వర, షిర్డీ సాయిబాబా, గురుదత్తా, శ్రీ రాజరాజేశ్వరీదేవి, వేంకటేశ్వరస్వామి వార్ల మహాకుంబాభిషేక మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రారంభమవుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. బుధవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించి, అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఈ నెల 20న ఒలింపిక్ డే రన్

కొత్తగూడెం టౌన్, జూన్ 16: ఈ నెల 23వ తేదీన అంతర్జాతీయ ఒలింపిక్ డేను పురస్కరించుకొని జిల్లా ఒలింపిక్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహిదర్ ఆదివారం తెలిపారు. 23వ తేదీన ఉదయం 7 గంటలకు కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒలింపిక్ డే రన్ ప్రకాశం స్టేడియం నుంచి ప్రారంభిస్తారని, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇల్లెందు ఇన్‌చార్జి ఏటీడీవోగా రాధమ్మ

ఇల్లెందు రూరల్, జూన్ 16 : ఇల్లెందు ఇన్‌చార్జి ఏటీడీవోగా సూర్ణపాక రాధమ్మ నియమితులయ్యారు. ఆదివారం ఏటీడీవో కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో ఏటీడీవోగా విధులు నిర్వహించిన రూపాదేవి ఖమ్మం ఏటీడీవోగా బదిలీపై వెళ్లారు. ఎస్టీ బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించారు. ఇల్లెందు ఏటీడీవోగా రూపాదేవి నాలుగు సంవత్సరాలు సేవలందించారు. రాధమ్మ (గ్రేడ్–1 హెచ్‌డబ్ల్యూవో(హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్)గా చర్లలో విధులు నిర్వహించారు. గుండాలలో మూడు సంవత్సరాలు, చర్లలో ఒక సంవత్సరం పనిచేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పామాయిల్ తోట దగ్ధం

దమ్మపేట, జూన్ 16 : విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పామాయిల్ తోట దగ్ధమైన ఘటన దమ్మపేట శివారులో ఆదివారం జరిగింది. దమ్మపేటకు చెందిన చక్కిరాల లక్ష్మణరావు పామాయిల్ తోటలోని విద్యుత్ లైన్ షార్ట్ సర్క్యూట్ జరిగి తోటలోని కలుపు మొక్కలకు అంటుకుని రెండు ఎకరాల్లోని పామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. పంట సీజన్‌లో చెట్లు కాలిపోవడంతో రైతు చక్కిరాల మోహన్‌రావు అవేదన చందుతున్నాడు.

అగ్ని బాధిత కుటుంబానికి చేయూత

దుమ్ముగూడెం, జూన్ 16: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బాలరాజు పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆ కుటుంబాన్ని పరామర్శించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వంట సామగ్రి, దుస్తులు, టార్పాలిన్, రూ.3 వేలు నగదు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ యోగి, సూర్యనారాయణ, భీమవరపు వెంకటరెడ్డి, బిల్లిపెల్లి రంగారెడ్డి, కాపుల నాగరాజు, నవాబు, రాజు పాల్గొన్నారు.

లైంగికదాడుల నిందితులను శిక్షించాలి

కొత్తగూడెం అర్బన్, జూన్ 16: ఆడపిల్లలపై లైంగికదాడులకు పాల్పడే నిందితులను వెంటనే శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అన్నారు. ఆదివారం ఆమె మహిళలతో కలిసి నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో లైంగిక దాడి, హత్య చేసిన నిందితుడిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పొదిలి జ్యోతి, సరిత, బోడ దివ్య, సున్నం లక్ష్మి, కృష్ణవేణి, పద్మశ్రీ, శ్రీలక్ష్మి, శారద, సావిత్రి, విజయలక్ష్మి, సుశీల, వీరమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

అన్నపురెడ్డిపల్లి, జూన్ 16 : మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. మండంలోని పలు గ్రామాల్లో ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి యోగ క్షేమాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ధైర్యం చెప్పారు.

మత ఘర్షణలకు తావివ్వొద్దు.. త్రీ టౌన్ ఇన్‌స్పెక్